ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

3

గురువారం 7 మార్చి 2024

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

నస్పూర్, మార్చి 6: నస్పూర్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు గాను డీఎంఎఫ్‌టీ నిదులు రూ, 4 కోట్లు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు తెలిపారు. 20వ వార్డు ప్రశాంత్ నగర్‌లో బుధవారం రూ.5లక్షల వ్యయంతో నిర్మించే మురుగు కాలువకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో మున్సిపాలిటీకి టీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు అం యనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సుబ్బారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దర్ని మధుకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ళ సంపత్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

జాతరకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

జైపూర్, మార్చి 6: వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌యాదవ్ అన్నారు. మండలంలోని వేలాల గ్రామంలోని గుట్టపైన ఉన్న గట్టు మల్లన్న, గుట్ట కింద ఉన్న మల్లికార్జున స్వామి ఆలయాలను బుధవారం దర్శించుకున్నారు. అనంతరం జాతరకు సంబంధించిన పనులను ఆయన తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం దేవాదాయ శాఖ కమిటీ సభ్యులు డీసీపీని సన్మానించారు. డీసీపీ వెంట ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ బన్సీలాల్, ఎస్ఐ ఉపేందర్, కమిటీ సభ్యులు డేగ నగేష్, ప్యాగ లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వందశాతం ఆస్తి పన్ను పసూలు చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహూల్

నస్పూర్, మార్చి 6: మున్సిపల్ పరిధిలో వందశాతం ఆస్తి పన్ను పసూలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహూల్ అన్నారు. నస్పూర్ మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని విభాగాలు పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను ఎంత వసూలు చేయాల్సి ఉన్నది, పూర్తి స్థాయిలో ఆస్తి పన్నును వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. మార్చి 31లోగా ఆస్తి పన్నును పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నూరు శాతం పన్నులు వసూలైయ్యే విధంగా ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందుగా కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్ రాహూల్‌కు చైర్మన్ సుర్మిళ్ల వేణు మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టును సందర్శించిన రిటైర్డు జడ్జిలు

ఏసీసీ, మార్చి 6 : మంచిర్యాల జిల్లా కోర్టును హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నారాయణ, రిటైర్డు జడ్జి, మాజీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూనియర్ న్యాయవాదులకు వృత్తిలో రాణించేందుకు మెళకువలు,పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డు జడ్జిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితారెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య,ప్రధాన కార్యదర్శి రంగు మల్లేష్, కోశాధికారి గంగయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

ఏసీసీ, మార్చి 6: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంను రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుదారులందరికీ ఎలాంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, కౌన్సిలర్లు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్‌కు మంగళం పాడి రాష్ట్ర ప్రజలపై వేల కోట్ల భారం మోపుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చెన్నూరు పట్టణంలో నిరసన తెలిపారు.

ముల్కల్ల పుష్కరఘాట్ మూసివేత

హాజీపూర్, మార్చి 6: మండలంలోని ముల్కల్ల పంచాయతీ పరిధిలోని గోదావరి పుష్కరఘాట్‌ను మూసివేస్తున్నట్లు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ సురేష్, ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. బుధవారం పుష్కరఘాట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరిత , కారోబార్ సత్యం పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష

ఏసీసీ, మార్చి 6: హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల సీనియర్ అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు. మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడకు చెందిన మార్త సదిరాజు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పనికి వచ్చేకూలీ వారితో అతని ఇంటికి ఎదురుగా ఉండే మ హ్మద్ చాంద్‌పాషా అకారణంగా గొడవ పెట్టుకునేవాడు. ఈ విషయంపై సదిరాజు చాంద్ పాషాను ఎందుకు కూలీలతో గొడవ పడుతున్నావని అడిగాడు. దీంతో సదిరాజుపై పగ పెంచుకున్నాడు. జూలై 25,2023న ఉదయం సదిరాజు తన కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి వెళ్తుండగా దారిలో ఆపి బూతులు తిడుతూ కత్తితో మెడ, ఎడమ భుజంపై దాడి చేశాడు. సదిరాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి అతని తండ్రి నారాయణ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. ప్రస్తుత ఎస్‌హెచ్‌వో రవీందర్ ఆధ్వర్యంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి బుధవారం నిందితుడికి నాలుగు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష , రూ. 100 జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీసీపీ అశోక్‌కుమార్ నేరస్తునికి శిక్షపడేలా చేసిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

కోటపల్లి, మార్చి 6: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల విధులు , నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సలీం, రాజశేఖర్, మహేష్, సురేందర్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: ఎన్నికలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని వెల్గనూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. బుధవారం దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులచే నమునా మాక్ పోలింగ్ నిర్వహించారు.

డీసీపీని కలిసిన జీఎం

మందమర్రిటౌన్, మార్చి 6: మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌ను బుధవారం మంమదర్రి ఏరియా జీఎం మనోహర్ మంచిర్యాలలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేశారు.



త్వరలో ఐబీకి ఎంసీహెచ్ తరలింపు

- ఇప్పటికే తీర్మానించిన మున్సిపల్ కౌన్సిల్
- స్థలం అప్పగింతకు ఆదేశాలు
- మహిళలకు తప్పనున్న ఇబ్బందులు

మంచిర్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) స్థానిక ఐబీ ఆవరణలోకి మారనుంది. ఈ మేరకు మున్సిపల్ సాధారణ సమావేశం తీర్మానించింది. ఆర్ అండ్ బీ ఆధీనంలో ఉన్న స్థలాన్ని అప్పగించాలనే ఆదేశాలు సైతం ఇటీవల జారీ అయ్యాయి. మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున గల ప్రభుత్వ స్థలంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. రూ.17 కోట్లతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. మూడు ఏళ్ల క్రితం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి తరలించారు.

అనంతరం 2022 జూలై 13న కురిసిన భారీ వర్షాలకు గోదావరి నది ఉప్పొంగి ఆస్పత్రి భవనం పూర్తిగా నీట మునిగింది. దీంతో కొద్ది కాలం పాటు తాత్కాలికంగా మూసివేసి మూడు నెలల అనంతరం శుభ్రపరి చిన తరువాత తిరిగి వినియో గంలోకి తీసుకువచ్చారు. అనంతరం 2023 జూలైలో కురిసిన భారీ వర్షాలకు భవనం మళ్లీ నీట మునిగింది. ప్రతిసారీ వరద నీరు వచ్చే అవకాశం ఉండడంతో అప్పటికప్పుడు అందులో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలను అసౌకర్యాల నడుమ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తూ వస్తున్నారు. దీంతో పురుడుపోసుకున్న మహిళలతో పాటు నిండు గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనికిరాని భూముల్లో..

ప్రస్తుతం మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ఉన్న భవన స్థలాన్ని మొదట జిల్లా కలెక్టరేట్‌కు కేటాయిస్తూ 2018లో తీర్మానం చేశారు. అప్పటి ఆర్ అండ్‌బీ అధికారులు మట్టి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు లూస్ సాయిల్‌గా తేలడంతో కలెక్టరేట్ భవన సుముదాయం నిర్మాణానికి పనిరాదని నివేదిక ఇచ్చారు. దీంతో అదే స్థలాన్ని తిరిగి ఎంసీహెచ్‌కు కేటాయించడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కలెక్టరేట్ భవన నిర్మాణానికి పనికిరాని భూములు ఎంసీహెచ్‌కు ఎలా పనికివస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. అయినప్పటికీ అదే స్థలాన్ని అధికారు లు ఆస్పత్రి భవనానికి ఎంపికచేయడంతో పాటు నిర్మాణం కూడా పూర్తి చేశారు. అదే సమయంలో ఊహించనివిధంగా కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం రూపుదిద్దుకోవడం, వర్షాకాలంలో గోదావరి నది ఉప్పొం గడం జరిగాయి.

దీంతో ఏటా ఎంసీహెచ్ భవనం నీట మునుగుతుం డగా, వైద్య సేవల కోసం వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి ఒడ్డున ఎంసీహెచ్ నిర్మించడం సరైన నిర్ణయం కాదని, అప్పట్లోనే ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తీవ్రంగా విబేధించారు. ఎంసీహెచ్ భవనాన్ని ఐబీ విశ్రాంత భవనం ఆవరణలో నిర్మించాలని సూచనలు చేశారు. దానికి భిన్నంగా అధికారులు, పాలకులు ఆ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి పూనుకున్నారు. గతంలో ఆర్ అండ్ బి అతిథిగృహానికి సదరు స్థలాన్ని కేటాయించగా, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కారణంగా మున్సిపాలిటీకి కేటాయిస్తూ అప్పట్లో తీర్మానం చేశారు. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం పనులు ప్రారంభం కాగా, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడం, అప్పట్లో సమీకృత భవనానికి కేటాయించిన స్థలంలోనే ఎంసీహెచ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసిన ప్రేమ్‌సాగర్‌రావు ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉండడంతో ఎంసీహెచ్ నిర్మాణ స్థల మార్పుకు మార్గం సుగమమం అయ్యింది.

ప్రజల కోరిక మేరకు..

ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఎంసీహెచ్ భవన విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ విషయంలో మొదటి నుంచి పట్టుదలతో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ప్రజలు కోరుకున్నవిధంగానే ఆస్పత్రిని ఐబీ స్థలంలోకి తరలించేందుకు సుగమం చేశారు. ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలోని నాలుగున్నర ఎకరాల స్థలాన్ని ఆస్పత్రికి కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో తీర్మానం కూడా చేశారు. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిలిచి పోనుండగా, అదేస్థలంలో ఎంసీహెచ్ భవనాన్ని నిర్మించనున్నారు. సదరు స్థలాన్ని వైద్య, ఆరోగ్య శాఖకు అప్పగించాలనే తుది నిర్ణయం కూడా జరిగింది. దీంతో గోదావరి ఒడ్డున ఉన్న ఎంసీహెచ్‌ను ఐబీకి తరలించేందుకు మార్గం సుగమం అయ్యింది.

తొలగనున్న కష్టాలు..

గోదావరి ఒడ్డున ఉన్న ఎంసీహెచ్ భవనం ఐబీ వద్దకు తరల నుండడంతో మహిళల కష్టాలు తీరుతాయనే భావన అన్ని వర్గాల్లో నెలకొంది. మాతా, శిశు కేంద్రంలో జిల్లావాసులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన మహిళలు కూడా ప్రసవం కోసం వస్తుంటారు. బాలింతలు, నిండు గర్భిణులు వివిధ ప్రాంతాల నుంచి గోదావరికి వెళ్లే రోడ్డులోని స్పీడ్ బ్రేకర్లను దాటుతూ ఎంసీహెచ్‌కు చేరడం ఇబ్బందిగా మారింది. అత్యవసర సమయాల్లో ప్రయాణించే వీలు లేని చోట ఆస్పత్రి ఉండడంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం తీర్మానం చేసిన మేరకు ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలోని స్థలాన్ని ఎంసీహెచ్ భవనానికి కేటా యించనున్నారు. దీంతో రవాణా సులభతరం కానుంది. ప్రతిపాదిత స్థలం ముందు ఆర్టీసీ బస్టాప్ ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు నేరుగా ఆస్పత్రిలోకి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది. పైగా ప్రస్తుతం కేటాయించిన స్థలానికి ఎదురుగానే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉండడంతో మహిళల కుటుంబ సభ్యులకు కూడా చికిత్స అందు బాటులో ఉండనుంది. ఆస్పత్రి ముందే బస్సు దిగనుండడంతో ఆటోల రూపేణా రవాణా ఖర్చులు ఆదా కానున్నాయని ప్రజలు చెబుతున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్



కన్నాలలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

బెల్లంపల్లి, మార్చి 6: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రైతు నేస్తం కార్యక్రమానికి బెల్లంపల్లి మండల ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్‌కు టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, ఎంపీపీ శ్రీనివాస్, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 110 రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా రైతులతో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సురేష్, ఎంపీపీ శ్రీనివాస్, అధికారులు, రైతులు , సిబ్బంది పాల్గొన్నారు. కన్నాల గ్రామ రైతు వేదికలో బుదవారం సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్, ఏడీ సురేఖ, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీఈవో మహేందర్, ఏవోలు వందన, కిరణ్మయి, ఏఈవోలు నాగదీప్తి, శ్రీనివాస్, పుష్ప, శంకర్, రైతులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని కిష్టంపేట రైతు వేదకలో బుదవారం సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్‌రావులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేశం , నోడల్ ఆఫీసర్‌వెంకటరమణ, సీఐ రవీం దర్, మండల వ్యవ సాయా. దికారులు మార్క్ గ్లాడ్‌స్టన్, మహేందర్,తహసీల్దార్ మల్లికార్జున్, , సెరీ కల్చర్ ఆఫీసర్ యోనస్, ఏఈవోలు సాయికృష్ణ, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, నాయకులు హిమవంత్‌రెడ్డి, అంకాగౌడ్ పాల్గొన్నారు.

భీమిని: మండలంలోని భీమిని రైతు వేదకలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రా వులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో భీమిని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఇంతియాజ్, నోడల్ ఆఫీసర్ దత్తరావు, ఏఈవోలు విజయ్‌కుమార్, ప్రేమ్ కుమార్, తహసీల్దార్ బికర్ణదాస్, ఏఈవో వినోద్‌కుమార్, విస్తరణ అధికారులు, జడ్పీటీసీ పోతు రాజుల గంగక్క, ఎంపీపీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 6: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీవో కిషన్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ వచ్చే లోక్ సభ ఎన్నికల్లో అర్హులైన వారందరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు పాటలతో విద్యార్థులకు ఓటు ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో పీడీ సిద్దయ్య, స్నేహ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, నీలిమ, రాంచందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 6: జిల్లాలోని గ్రామపంచాయతీల్లోబకాయి ఉన్న పన్ను లను వంద శాతం వసూలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌కార్యాలయంలో అదనపుకలెక్టర్ రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పన్నుల వసూలులో జిల్లా సగటు 70 శాతం ఉందని,మార్చి 15 లోగా వంద శాతం వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రకాల భూసమస్యలపై అభ్యర్థులు ధరణి పోర్టల్ ద్వారా చేసుకున్నదరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ధరణిలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్‌రాహుల్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ ఈఈ వెంకటేష్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి బోర్‌వెల్‌లు, పంపుసెట్లు, లీకేజీ పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

అర్హులకు గ్యారంటీ పథకాలు

దండేపల్లి, మార్చి6: అర్హులైన ప్రజలందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దండేపల్లి మండల పరిషత్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం దండేపల్లి మండల పరిషత్ కార్యలయంలో ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఎంపీడీవో జేఆర్ ప్రసాద్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి

భీమారం, మార్చి 6: మండలంలోని వివిధ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో రాథోడ్ రాధా సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వ హించారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలి

మందమర్రిరూరల్, మార్చి 6 : ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు ఇవ్వని వారు, తప్పుగా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ హెల్ప్ డెస్క్‌లో గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవా లని సూచించారు.

డీజేలు వినియోగించకూడదు

మందమర్రిటౌన్, మార్చి 6: మందమర్రి సర్కిల్ పరిధిలో డీజేలు వినియోగించకూడదని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మందమర్రి పోలీస్ స్టేషన్‌లో డీజే సిస్టం నిర్వహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకులకు పరామర్శ

నెన్నెల, మార్చి 6: నెన్నెల మండల పరిషత్తు కార్యాలయం సూపరింటెండెంట్ రాధాకృష్ణ అనారోగ్యంతో మృతి చెందగా పలువురు అధికారులు బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదనపు కలెక్టర్ రాహూల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు రాధాకృష్ణ పార్థివదేహానికి పూలమాలలు వేశారు. బెల్లంపల్లి డివిజన్‌లో రాధాకృష్ణ ఇన్‌చార్జీ ఎంపీడీవోగా గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి ని గుర్తు చేసుకున్నారు. నెన్నెల ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌లు సంతాపం ప్రకటించారు. ఉద్యోగులు, బంధువులు మంచిర్యాలలో నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బెల్లంపల్లి, మార్చి 6: పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌టీఆర్ నగర్ లోని అవనిగంటి సాంబమూర్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉందనే సమాచారం మేరకు దాడి చేయగా 12 క్వింటాళ్ల బియ్యం పట్టు బడిందన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిరుపతి, శ్రీను, శ్రీధర్ పాల్గొన్నారు.

జన్నారం: చింతగూడ గ్రామానికి చెందిన జరు కుల కాంతయ్య అనే వ్యక్తి ఆటోలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండల కేంద్రానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

ఏసీసీ, మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు హాలులో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అతిథిగా హాజరయ్యారు. భర్త ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయినప్పటికీ మనోధైర్యం వీడకుండా కూరగాయలు అమ్ముతూ ఐదుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన మహిళ లక్ష్మిని సన్మానించి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వనితావాక్కు ఫౌండర్ వేణుకుమార్ గోనె భాగ్యలక్ష్మి, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీలత, మాతా శిశు సంక్షేమ అధికారిణి డాక్టర్ నీరజ, డాక్టర్ అన్నపూర్ణ, మంజుల, డాక్టర్ స్వరూపరాణి, చిదానందకుమారి, కవిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ: మహిళల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం నిరంతరం కృషి చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నారీశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా హమాలీవాడలో వర్చువల్‌గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జైన్, హరికృష్ణ, లావణ్య, శ్రీదేవి, హరికృష్ణ, స్వప్న పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: జీఎం కార్యాలయం ఎదుట ఉన్న కేంద్ర నర్సరీలో మహిళా ఉద్యోగినులకు బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్ పోటీలను డీజీఎం(పర్సనల్) అరవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజు, సీనియర్ పీవోలు కాంతారావు, సునీల్ కుమార్, సంతన్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి లా అధికారి ప్రబంధిత తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత, సీడీపీవో ఉమాదేవి అన్నారు. సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు సరిత, సంగీత, ప్రమీల పాల్గొన్నారు.

తాండూర్‌లో పర్యటించిన కలెక్టర్

తాండూర్, మార్చి 6: తాండూర్ మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రక్రి యను తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేశారు. అనంతరం మాదారం టౌన్‌షిప్‌లోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, మార్చి 6: మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం పొందే విద్యార్థుల నుంచిదరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి10వ తరగతి వరకు ఉన్న ఖాళీల కోసం మార్చి 11లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్సీఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రైవేశ పరీక్ష ఫీజు రూ. 125 కాగా, ఓపెన్ కేటగిరి విద్యార్థులకు రూ. 200 ఉంటుందని తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

కాసిపేట, మార్చి 6: వేసవి కాలంలో వచ్చే నీటి సమస్యను పరిష్కరి స్తామని తహసీల్దార్ భోజన్న అన్నారు. ముత్యంపల్లి పంచాయతీలో బుధ వారం ఆయన పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, వెంకటేష్, ఓదెలు, మారం రాజ్‌కుమార్, అరవింద్, నరేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణను సక్రమంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 6: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. నస్పూర్ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేణు, అధికారులు పాల్గొన్నారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు


నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగు నీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్‌హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్లు మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ' రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరికొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి ' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు


హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.



సాలేగూడలో మంచినీటి సరఫరాకు చర్యలు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వాంకిడి, మార్చి 6: మండలంలోని ఖమాన గ్రామపంచాయతీలోని సాలేగూడ గ్రామంలో గుక్కెడు నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో బుధవారం చెలిమెనీరే దిక్కు అనే శీర్షికతో ప్రచురితమైంది. స్పందించిన మిషన్‌భగీరథ డీఈ ఇర్ఫాన్, ఏఈ శ్రీనివాస్ గ్రామంలో నీటిసరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని బుధవారం పరిశీలించి పైప్‌లైన్‌ద్వారా ప్రజలకు నీరు అందిచేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



రంగుమారుతున్న రాజకీయం

● బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తుతో స్థానిక నేతల గుస్సా
● సీఎంతో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప
● సిర్పూరులో బీఆర్ఎస్‌కు పెద్దషాక్
● మరోవైపు పొత్తుపై చర్చించకపోవడంతో బీఎస్పీ నాయకుల అసంతృప్తి

ఆసిఫాబాద్, మార్చి 6: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రాజకీయం రంగు మారుతోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీల పొత్తులతో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీఎస్పీ దోస్తీ కుదరటం సిర్పూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ క్యాడర్ అంతా గుస్సాగా ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆయన అనుచరగణంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోనప్పతో పాటు ఆయన సోదరుడు జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావు కలిశారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సిర్పూరు నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ తీరును అడుగడుగునా ఎండ గడుతూ లోపాలను ఎత్తి చూపుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ మధ్య హోరాహోరీ పోరు నడిచింది. ఈనేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీజేపీ నుంచి బరిలో నిలిచిన ఎమ్మెల్యే హరీష్ బాబుపై స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. ఆయన ఓటమికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రధాన కారణకుడన్న విషయం తెలిసిందే.

తాజాగా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ కలిసి పనిచేస్తుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్పీ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో మీడియా ముందు వెల్లడించారు. ఈ పరిణామాలను సిర్పూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ క్యాడర్ జీర్ణిం చుకోలేకపోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఓటమికి కారణమైన బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నట్టు ప్రకటించటంతో మాజీఎమ్మెల్యే కోనప్పతోపాటు ఆయన అనుచరగణం పూర్తిగా అసంతృప్తితో రగిలిపోతోంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తాజా నిర్ణయంతో వీరంతా పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి మూకుమ్మడిగా చేరనున్నారు. ఈ నిర్ణయంతో సిర్పూరు నియోకవర్గంలో బీఆర్ ఎస్ పార్టీకి పెద్దషాక్ తగలినట్లయింది.

సీఎంతో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు ఏర్పడటంతో మాజీ ఎమ్మెల్యే కోనప్ప బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈనేపథ్యంలో మంత్రి పొంగులేటి సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటి కావటం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కోనప్ప కాంగ్రెస్‌పార్టీలో చేరితే సిర్పూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగలనుంది. కోనప్ప సోదరుడైన జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావుతో పాటు ఇటీవల నూతనంగా ఎన్నికైన కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్‌చైర్మన్‌లతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఆయామండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచిలు, మండలపార్టీ అధ్యక్షుడు మూకుమ్మడిగా కాంగ్రెస్‌పార్టీలో చేరనుండగా బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగలనుంది.

ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న క్యాడర్ అంతా మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరితే నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కానుంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లయితే నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా పట్టే వారు కూడా కరువు అవుతారని అంతా చర్చించుకుంటున్నారు.

ఆదిలాబాద్ ఎంపీ సీటు బీఎస్పీకి కేటాయించాలని డిమాండ్

కాగజ్‌నగర్: బీఆర్ఎస్, బీఎస్పీల పొత్తు రాష్ట్రంలో ఒక్కసారిగా చర్చకు తెరలేపింది. సిర్పూరు నియోజకవర్గంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు అంతా షాక్‌కు గురవుతున్నారు. కనీసం తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయం ఎలా తీసుకుంటారని చర్చించుకుంటున్నారు. బుధ వారం మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి నివాసంలో ఆయా మండలాల నాయకులు, మున్సిపాల్టీలోని 30వార్డుల బాధ్యులు కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ టిక్కెట్టు మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతికి కేటాయించాలని అంతా డిమాండ్ చేశారు. పొత్తు ఎవరితో ఉన్నా సరే టిక్కెట్టు మాత్రం ఖచ్చితంగా సిడాం గణపతికి కేటాయించాలని డిమాండు చేస్తున్నారు. సిడాం గణపతికి ఉమ్మడి జిల్లాలో మంచిపట్టు ఉందని ఈ విషయంలో ఒక్కసారి అవకాశం ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలు డిమాండు చేస్తున్నారు.

బీఎస్పీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన కే వదిలేస్తామని కానీ ఒక్కసారి మా అభిప్రాయం తీసుకుంటే బాగుటుండేదని పలువురు కార్యకర్తలు బాహాటంగా పేర్కొంటున్నారు. తామెంతో కష్టపడి అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్‌పీకి ఏకంగా 40వేల ఓట్లు తెచ్చిపెట్టామని ఇప్పుడు పొత్తు విషయం తమతో చెప్పకపోవటం ఏంటనీ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఇతర పార్టీల నాయకులు కూడా ఆర్ఎస్‌పీపై బహుజన వాదాన్ని దొరకాళ్ల వద్ద తనఖా పెట్టారని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరి కొంత మంది ఏకంగా తమ పార్టీలోకి రావాలని ఫోన్‌లో సందేశాలు కూడా పంపిస్తున్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఇక్కడి సీటు తప్పకుండా బీఎస్పీకి కేటాయించాలని, లేని పక్షంలో తమ దారి తామే చూసుకుంటామని కొంతమంది నాయకులు పేర్కొంటున్నారు. మరో మూడు రోజుల్లో సిర్పూరు నియోజకవర్గానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నారని, ఆ తర్వాతనే భవిష్యత్తు కార్యచరణ తెలుస్తుందన్నారు.



కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలి

వాంకిడి, మార్చి 6: భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఈనెల7,8తేదీల్లో మండలకేంద్రంలోని మార్కెట్‌లో జిల్లాస్థాయి కబడ్డీపోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు గెడాం టీకానంద్, గొడిసెల కార్తీక్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.7000, షీల్డ్, రెండో బహుమతిగా రూ.5000, షీల్డ్ అందిస్తా మన్నారు. అసక్తిగల క్రీడాకారులు 7న ఉదయం 9గంటలలోపు తమజట్టు పేరును నమోదు చేసుకోవాలనివారు కోరారు. పూర్తివివరాల కోసం 6302363282 నంబరును సంప్రదించాలని వారు కోరారు.

బిల్లులు చెల్లించాలి: ఎంపీటీసీ

జైనూర్, మార్చి 6: మండలంలోని గూడ మామడ గ్రామ పంచాయతీలో సీసీరోడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఎంపీటీసీ జుగాదిరావ్ ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలే కర్లతో మాట్లాడుతూ పనులుచేసి రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లులు మంజూరు చేయడంలో చాలా ఆలస్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. పక్క మండలాలైన కెరమెరి, సిర్పూర్(యు), లింగాపూర్ తదితర మండలాల్లో ఇదివరకే సిమెంట్ రోడ్ల బిల్లులు మంజూరు చేశారని అన్నారు. కేవలం జైనూరు మండలంలో మాత్రమే బిల్లులు మంజూరు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమెంట్‌రోడ్డు పనుల బిల్లులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో మాజీసర్పంచులు గేడాం సత్యభామ, కుంర కేశవరావ్, గెడాం డిగంబర్ పాల్గొన్నారు.

బీఎస్పీతో బీఆర్ఎస్ పొత్తును వ్యతిరేకిస్తున్నాం

బెజ్జూరు, మార్చి 6: సిర్పూర్‌లో కోనేరు కోనప్పను ఓడగొట్టడానికి కంకణం కట్టుకొని వచ్చిన వ్యక్తిని బీఆర్ఎస్‌తో కలుపుకోవడం ఏమిటని బీఆర్ఎస్ పార్టీనాయకులు ప్రశ్నించారు. బుధవారం స్థానికంగా వారు మాట్లాడుతూ మా మనోభావాలను దెబ్బ తీసేలా బీఆర్ఎస్ అధిష్టానం వ్యవహరించడం సరి కాదన్నారు. కోనేరు కోనప్ప ఏ నిర్ణయం తీసుకున్నా వారి నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు.

సిర్పూర్(టి): మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప వెంటే తాము ఉంటామని ఎంపీపీ సువర్ణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ నాయకుడు కోనప్ప ఏపార్టీలో చేరితే ఆపార్టీలోకి వెళ్తామన్నారు. కోనప్ప వెంటే తాము ఉంటామన్నారు. కార్యక్రమంలో సకారాం, బషరత్ ఖాన్, శేఖర్, హన్మంత్, తిరుపతి, శంకర్, ఎంపీటీసీ శ్రీను, వెంకటేశం, కోఆప్షన్ సభ్యుడు కీజర్‌హుస్సేన్, నాయకులు దుర్గం విక్రం, తోట మహేష్, శ్రీనివాస్, ఇప్తతుస్సెన్, అమీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచాలి

● కలెక్టర్ వెంకటేష్ దౌత్రె



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దౌత్రె

ఆసిఫాబాద్, మార్చి 6: పదవ తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచే విధంగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దౌత్రె అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌తో కలిసి పోలీసు, విద్యుత్, వైద్య, ఆరోగ్య, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులతో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 18నుంచి ఏప్రిల్ 2వరకు నిర్వహించే పదవతరగతి పరీక్షలకు 37పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 6,595మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పరీక్షల నిర్వహణకు 37 మంది ఫ్లయింగ్‌స్క్వాడ్, మొబైల్‌టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షాకేంద్రాల సమీపంలోని జీరాక్స్‌సెంటర్లు మూసివేతతోపాటు పోలీసు బందోబస్తు, 144సెక్షన్ అమలు చేస్తామన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ అధికారులు ప్రణాళిక బద్ధంగా బస్సులు నడిపించాలన్నారు. అత్యవసర వైద్యసేవల నిమిత్తం పరీక్షా కేంద్రాలవద్ద వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమికచికిత్స కిట్లతోపాటు ఓఆర్ఎస్ ప్యాకేట్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతూ వైద్య సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు విద్యుత్‌సరఫరా లోపం లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు తాగునీరు, మూత్రశాలలు, పారిశుధ్యనిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయాలని, చీఫ్ ఇన్విజిలేటర్లు ఒకరోజు ముందుగా ఇన్విజిలేటర్లకు తగుసూచనలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లాపంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి తుకారాంభట్, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దౌత్రె అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖాధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తోకలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలలో సహజంగా ఉండేఓర్పు, సహనం కుటుంబాన్ని తీర్చిదిద్దడంతోపాటు సమాజంలోని అన్నిరంగాల్లో రాణించి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు క్రీడలు, ఉద్యోగాలు లాంటి ప్రతిరంగంలో ముందుండాలని జాతీయస్థాయిలో క్రీడారంగంలో నిర్వహించేపోటీలలో పాల్గొని దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రతిమహిళ చదువు, ఉద్యోగం, రాజకీయం, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విజేతలను కలెక్టర్, ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సీడీపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 6: వచ్చే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చుడాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటి నుంచే ఆయాగ్రామాల్లో నీటి ఎద్దడిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పలుగ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు సక్రమంగా అందడంలేదని గుండి ఎంపీటీసీ మల్లేష్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గిరివికాసం కింద బోర్లు వేసుకున్నప్పటికీ విద్యుత్‌కనెక్షన్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీపీ అన్నారు. గోవింద్‌పూర్ గ్రామపంచాయతీ ప్రజలు గుండి గ్రామానికి వెళ్లి రేషను సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గోవింద్‌పూర్‌లో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలన్నారు. గోవింద్‌పూర్‌లో మనఊరు మనబడి కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని గుండి ఎంపీటీసీ మల్లేష్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కుమరం భీం ప్రాజెక్టు కింద సాగునీరందడంలేదని ఎంపీపీ పేర్కొన్నారు. అంతకు ముందు ఆయాశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివివినిపించారు. సమావేశంలో డీఎల్పీవో ఉమర్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీలార్ శ్రీనివాస్ దేశ్ పాండే, సింగిల్‌విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సిర్పూర్(టి), మార్చి 6: మండలానికి మంజూరైన దృశ్యమాలికను సీఎంరేవంత్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతునేస్తమే కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుఆర్థికంగా అభివృద్ధిచెందితే మండలాలు, జిల్లాలు, రాష్ట్రంఅభివృద్ధి చెందుతాయన్నారు. తమప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఫసల్‌బీమా అమలు చేస్తుందన్నారు. అనంతరం వీసీద్వారా సిర్పూర్(టి), బెజ్జూరు, కౌటాల, పెంచికలపేట, కాగజ్‌నగర్ మండలాల వ్యవసాయాధికారులకు పలుసూచనలు చేశారు. ఏడీఏ మనోహర్ మాట్లాడుతూ ఈ వీసీ ప్రతిమంగళ, శుక్రవారాల్లో ఉంటుందన్నారు. దీనికిమండలంలోని రైతులు, నియోజకవర్గంలోని అన్నిమండలాల వ్యవసాయాధికారులు పాల్గొనివారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణ, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, తుకారాం, శైలజ, కోఆప్షన్ కీజర్ హుస్సెన్, ఏవో మధులత, ఏఈవోలు కవిత, నేహాత బస్సుం,శ్రీనివాస్,వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

జైనూర్, మార్చి 6: పవర్‌గూడ ఆరోగ్య ఉపకేంద్రంలో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యంగా వేసవిలో బోరింగులు, బావుల్లోని కలుషితనీటిని తాగుతూ వ్యాధులకు గురవుతున్నామన్నారు.

సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలి

లింగాపూర్, మార్చి 6: సీసీరోడ్ల నిర్మాణపనుల్లో నాణ్యతపాటించాలని పంచాయతీరాజ్ ఇంజనీర్ ఆడే ధర్మేందర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలమంజూరైన రూ.కోటి5లక్షలతో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

ఎంపీగా అవకాశం ఇస్తే న్యాయం చేస్తా


లింగాపూర్, మార్చి 6: కాంగ్రెస్ పార్టీ ఎంపీగా తనకు అవకాశం ఇస్తే అన్నివర్గలకు న్యాయం చేస్తానని ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం ఆమె మండలంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతనకు ఎంపీగా పోటీఅవకాశం ఇస్తుంది అనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

సిర్పూర్(టి), మార్చి 6: మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సువర్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మెజార్టీ సభ్యులు సమావేశానికి రాకపోవడంతో ఎంపీపీ సువర్ణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

బెజ్జూరు, మార్చి 6: ఈనెల8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని రంగనాయక ఆలయం, శివాలయం, హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలను రంగులతో అలంకరిస్తున్నారు. మండల కేంద్రంలో రెండురోజులపాటు జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీఅధ్యక్షుడు మహేష్ తెలిపారు. ఇక్కడి రంగనాయక ఆలయం ఎంతో పురాతనమైనదిగా పేరు గాంచింది. రంగనాథుడికి మహాశివరాత్రి పర్వదినాన మొక్కులు చెల్లించుకుంటారు.



ఆర్కే5బి సెక్షన్ మూసివేత

శ్రీరాంపూర్, మార్చి 6: శ్రీరాంపూర్‌లోని ఆర్కే5బి సెక్షన్(గని)ను బుధవారం మూసివేశారు. సుమారు 35 ఏళ్ల క్రితం ప్రారంభించిన సెక్షన్‌లో బొగ్గు నిల్వలు నిండుకోగా, మిగిలిన బొగ్గును ఆర్కే5 గని ద్వారా తీస్తున్నారు. మూసివేత పనులు 2నెలలుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే కార్మికులను ఆర్కే5 గనికి పంపారు. వారు అక్కడి నుంచే గనిలోకి దిగి బొగ్గు ఉత్పత్తిలో పాల్గొంటున్నారు. బుధవారం వేదపండితుల సమక్షంలో ప్రత్యేకపూజల అనంతరం మూసివేశారు. ఈ సందర్భంగా గ్రూప్ ఏజెంట్ మాట్లాడుతూ, బొగ్గు ఉత్పత్తిలో 5బి సెక్షన్ కొన్నేళ్లుగా ఎంతో కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, పిట్ కార్యదర్శి నర్సింగరావు, ప్రసాద్ రెడ్డి, యూనియన్ నాయకులు, మైనింగ్ సిబ్బంది, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధిలో అధికారులది కీలకపాత్ర: సీఎండీ

శ్రీరాంపూర్, మార్చి 6: సింగరేణి అభివృద్ధిలో అధికారులది కీలకపాత్ర అని సంస్థ సీఎండీ ఎన్ బలరాం అన్నారు. కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) సింగరేణి విభాగం అధికారులతో బుధవారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బొగ్గు రంగంలో పోటీని తట్టుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలని, దీనికి అధికారులు, కార్మికులు సహకరించాలన్నారు. సంస్థ అభివృద్ధిపథంలో నడపడానికి అవసరమైన సూచనలు చేయాలని కోరారు. మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాలు మరింత విస్తృతపరచాలని సూచించారు. అనంతరం అధికారుల సంఘం నూతన అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు సారథ్యంలో 12ఏరియాలకు చెందిన అధికారులసంఘం అధ్యక్షులు చైర్మన్ బలరాంను సన్మానించారు. లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ, సంస్థకోసం 24గంటలు పనిచేసే అధికారులకు ల్యాప్‌ట్యాప్‌లు ఇవ్వాలని, వారి పిల్లలకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరగా, చైర్మన్ నిర్ణయం తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో జీఎం(కోఆర్డినేటషన్) ఎం సురేష్, ఇతర అధికారులతోపాటు అధికారుల సంఘం ఉపాధ్యక్షులు పొనుగోటి శ్రీనివాస్, పి రాజీవ్‌కమార్, సహాయ కార్యదర్శులు ఆర్ కిరణ్‌రాజ్‌కుమార్, సీహెచ్ రాజగోపాల్, కోశాధికారి నరేష్, సహాయ కార్యదర్శి బి రాగోపాల్, అన్నిఏరియాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ ఆన్‌లైన్‌పై శిక్షణ

శ్రీరాంపూర్, మార్చి 6: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) ఆన్‌లైన్ చేసే విషయమై బుధవారం క్లరికల్ సిబ్బందికి బుధవారం జీఎం కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథులుగా సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచౌరి హాజరయ్యారు. సీఎంపీఎఫ్ ఎలా ఆన్‌లైన్ చేయాలి, సెటిల్మెంట్ ఎలాచేయాలో సిబ్బందికి వివరించారు. శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు సీఎంపీఎఫ్ అంశాలను కూలంకశంగా నేర్చుకొని సంబంధిత పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, రామగుండం ఏరియాలకు చెందిన సంక్షేమాధికారులు, ఏటీబీసెల్, ఫైనాన్స్ విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప


సీఎంతో మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్, మార్చి 6: సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప హైదరాబాద్‌లో కలిశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండ్రోజుల క్రితం బీఎస్పీతో పొత్తులు పెట్టుకున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా బరిలో ఉన్న ఆర్ఎస్పీతోనే బీఆర్ఎస్ అధినేత పొత్తులు పెట్టుకోవటం సిర్పూరులో చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంతోనే సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన వెంట జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఉన్నారు.

ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, మార్చి 6: లేఅవుట్ రెగ్యూలరైజేషన్ స్కీంలో ప్రభుత్వం ఎలాంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా ప్లాట్ల రెగ్యూలరైజేషన్ చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన ధర్నాలో ఆమెపాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చి మాటమార్చిందన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల నుంచి కనీసం రూ.లక్ష చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.20వేల కోట్ల వరకు భారాన్ని మోపేందుకు సిద్ధమయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మేనిఫెస్టోలో ఎన్నో హామీలిచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండి ఎల్ఆర్ఎస్ ద్వారా ఎలాంటిఛార్జీలు లేకుండా ప్లాట్లను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలను చేపడతామన్నారు. ధర్నాలోనియోజకవర్గంలోని పదిమండలాలకు చెందిన బీఆర్ఎస్‌పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీమండల అధ్యక్షులు, సహకార చైర్మన్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్, మార్చి 6: జిల్లాకేంద్రంలో నిర్మితమవుతున్న జిల్లా గ్రంథాలయశాఖ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని కలెక్టర్ వెంకటేష్ దౌత్రె అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో రూ.1.50కోట్లతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను డీఈ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ శాఖ నూతన భవన పనులను వారం రోజుల్లోగా పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్,ఏఈ కిరణ్,లైబ్రేరియన్ సదానందం, కాంట్రాక్టర్ అమర్‌బీన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

విద్యాసంవత్సరా(2024-25)నికి గాను రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు హైదరాబా ద్‌లోని బేగంపేట్, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి లో ప్రవేశానికి అర్హులైన గిరిజనవిద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు కలెక్టర్ వెంకటేష్‌దౌత్రె ఒక ప్రకటనలో తెలి పారు. గోండు, నాయక్‌పోడ్, పర్ధాన్‌లకు3, కోలాం, అంద్‌లకు 1, లంబాడ1, ఇతర గిరిజనులకు 1మొత్తం 6సీట్ల ద్వారా ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 14నథ్రాతీస్తామన్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ జట్టు ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 6: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడాపాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. హెచ్ఎం కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూవో విజయశాంతి, భీంరావు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. క్రీడల్లో వందమంది క్రీడాకారులు పాల్గొనగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ తెలిపారు. వీరు ఈ నెల 8నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాలురపోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, టీడబ్ల్యూ స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్, కోచ్ అరవింద్ తదతరులు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు